
సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 7 । జూన్ । 2024



నిర్వహణ లోపం..
హైవే-167 పనుల నిర్వహణ లోపంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.
వివరాలు 8లో ▸



మరమ్మతులు ప్రారంభం
జూరాల ఎడమ కాల్వ అడుగుభాగంలో కొత్తగా బెడ్ వేసే పనులకు శ్రీకారం చుట్టారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /24.2
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

హలో.. డీఏఓ

- నేడు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్
- శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

సాక్షి ఫోన్ ఇన్


చంద్రశేఖర్

సాక్షి, నాగర్‌కర్నూల్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రుతుపవనాలు రాక మొదలవడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు వేసేందుకు అనువైన సమయం, నకిలీ విత్తనాల విషయంలో జాగ్రత్తలు, సాగులో మెలకువలు తదితర అంశాలపై శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టింది. జిల్లా రైతులు శుక్రవారం ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి నేరుగా జిల్లా వ్యవసాయశాఖ అధికారితో మాట్లాడవచ్చు.


సమయం : శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

కాల్ చేయాల్సిన ఫోన్ నంబర్లు: 72888 94286, 88972 29929

గులాబీ డీలా..

లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానంలోకి బీఆర్‌ఎస్

- ఏ దశలోనూ పోటీ ఇవ్వని గులాబీ అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో రెండు సిట్టింగ్ స్థానాలు కోల్పోవడంతో శ్రేణుల్లో నైరాశ్యం
- పార్టీ మారి ఎంపీగా పోటీ చేసినా ఫలించని ఆర్‌ఎస్పీ వ్యూహం
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశలు



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ పార్టీ ప్రభావం నామమాత్రంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాల తర్వాత కేవలం ఆరు నెలల్లోనే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓట్ల శాతాన్ని మరింత నష్టపోవడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం కేంద్రంగా ఎంపీగా గెలుపొందటంతో ప్రారంభమైన పార్టీ ప్రస్థానం అంచెలంచెలుగా ఎదిగి లోక్‌సభ, అసెంబ్లీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థలు.. ఎన్నికలు ఏవైనా గులాబీ పార్టీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జైత్రయాత్రను సాగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు సిట్టింగ్ స్థానాలను కోల్పోయి డీలాపడి కన్పిస్తోంది. రెండు లోక్‌సభ స్థానాల్లోనూ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఏ దశలోనూ ప్రభావం చూపించలేక మూడోస్థానంలో నిలవడం పార్టీ నేతలు, శ్రేణుల్లో నైరాశ్యాన్ని నింపింది.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన సీన్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో 13 చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. కొల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి అనంతరం గులాబీ పార్టీలో చేరడంతో ఆ సంఖ్య 14కు చేరింది. తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్, జిల్లాపరిషత్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నేతలే చైర్మన్లు, పాలకవర్గాలుగా కొలువుదీరారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 స్థానాలకు గాను 12 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో మాత్రమే గులాబీ నేతలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లోనూ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో ప్రభావం చూపలేకపోయారు. రెండు చోట్ల ఆపార్టీ అభ్యర్థులు మూడో స్థానానికి పరిమితం అయ్యారు. మొత్తం 22 రౌండ్లలో ఏ దశలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రభావాన్ని చూపలేదు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ కొనసాగగా, గులాబీ అభ్యర్థులు మూడోస్థానంలో నిలిచారు.

గతమెంతో ఘనం..

ఐదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో 13 చోట్ల గెలుపొంది, రెండు లోక్‌సభ స్థానాలను సొంతం చేసుకుని గులాబీ పార్టీ ఒక దశలో తారాస్థాయికి చేరింది. రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు, ఉమ్మడి జిల్లాలోని అన్ని జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ స్థానాలు, మెజార్టీ సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంది. 2009లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి కేసీఆర్ బరిలో నిలిచి 3,66,569 ఓట్లను సాధించారు. అప్పటి సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి దేవరకొండ విఠల్‌రావుపై 20,184 ఓట్ల మెజార్టీతో కేసీఆర్ ఎంపీగా గెలుపొందారు. అనంతరం 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏపీ జితేందర్‌రెడ్డి సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి జైపాల్‌రెడ్డిపై 2,590 ఓట్లతో విజయం సాధించారు. 2019లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి 77,829 ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో మహబూబ్‌నగర్ స్థానంలో గులాబీ హ్యాట్రిక్ సాధించింది. 2019 ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి పోతుగంటి రాములు 1,89,748 ఓట్ల మెజార్టీతో గెలుపొందటంతో ఈ స్థానంలో ఆపార్టీ బోణీ కొట్టింది. ఇటీవల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది.

ఫలించని ఆర్‌ఎస్పీ వ్యూహం..

ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంపై గులాబీ పార్టీ ముందు నుంచే ఆశలు పెట్టుకుంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకుని ఈ స్థానం నుంచి తమ అభ్యర్థిగా బరిలో నిలిపింది. లోక్‌సభ నియోజకవర్గంలోని అలంపూర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌ను పోటీలో ఉంచడం ద్వారా పెద్ద సంఖ్యలో ఉన్న మాదిగ సామాజికవర్గ ఓట్లపై నమ్మకం పెట్టుకుంది. స్థానికుడు, విద్యావంతుడిని ఆశీర్వదించాలంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో అధినేత కేసీఆర్ రెండు రోజుల పాటు పర్యటించి, రోడ్ షోల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో రెండుస్థానాల్లో పార్టీ మూడో స్థానంలో నిలవడంతో గులాబీ నేతలను షాక్‌కు గురిచేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని పదవిని నిర్ణయించే జాతీయ పార్టీల వైపే ప్రజలు మొగ్గుచూపారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పరిస్థితి ఉండదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందుకనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమయ్యేలా శ్రేణుల్లో భరోసా నింపేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

మరోసారి తెరపైకి..

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు అనుమతి



- కోర్టు కేసులు, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యం
- నేడో.. రేపో షెడ్యూల్ వచ్చే అవకాశం
- గతంలో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు
- టెట్‌తో సంబంధం లేకుండా ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మరోసారి తెరపైకి వచ్చింది. త్వరలో ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మరోసారి ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వం గతేడాది ఎన్నికల కంటే ముందు ప్రక్రియ చేపట్టినా టెట్ అర్హత తదితర కారణాలతో కోర్టు కేసులు, వరుస ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైంది. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్లు చేపట్టే దిశగా అడుగులు వేస్తుంది. నేడో.. రేపో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 2,980 పాఠశాలల్లో 14 వేలకు పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో గతేడాది సెప్టెంబర్‌లో చేపట్టిన బదిలీల్లో 9,818 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 202 మంది హెచ్‌ఎంలకు జోనల్‌స్థాయిలో మాత్రమే బదిలీలు జరిగాయి. ఇంకా జిల్లాస్థాయిలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పీఈటీలు, పండిట్‌ల బదిలీల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఇది కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జోన్లు.. జిల్లా స్థాయిలో..
వివిధ జోన్లు, జిల్లాస్థాయిలో ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు హెచ్‌ఎంలుగా, గ్రేడ్- 2 పండిట్‌లను గ్రేడ్- 1గా, తెలుగు, హిందీ పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. అయితే గతంలో టెట్ పరీక్ష రాసి ఉద్యోగాలు సాధించిన వారు, టెట్ లేకుండా ఉద్యోగాలు సాధించిన వారు ఉన్న నేపథ్యంలో ప్రమోషన్లు ఎలా ఇవ్వాలనే అంశంపై గందరగోళం నెలకొని ప్రక్రియ నిలిచింది. ఇటీవల కోర్టు టెట్‌తో సంబంధం లేకుండా ఇవ్వాలని సూచించింది.

➪ 2022లో 317 జీఓ ఆధారంగా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలకు పలువురు ఉపాధ్యాయులు స్థానికత ఆధారంగా విభజించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్పౌజ్ బదిలీలు ఇప్పటికీ చేపట్టలేదు. దీంతో వారు పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపడుతూ భార్య ఒక చోట.. భర్త ఒక చోట విధులు నిర్వహిస్తున్నారు. ఈ బదిలీల్లో అయినా తమకు పూర్తి న్యాయం చేయాలని స్పౌజ్ బాధితులు కోరుతున్నారు.

ఫిర్యాదుల వెల్లువ..

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టింది. జోన్- 1లో బదిలీలు, ప్రమోషన్లు పూర్తి అయినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జోన్- 2లో మాత్రం కేవలం హెచ్‌ఎంల బదిలీలు జరిగగా ప్రమోషన్లు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే కొందరు ఉపాధ్యాయులు స్పౌజ్‌ను దుర్వినియోగం చేసినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చి.. డీఈఓ, ఆర్జేడీకి సైతం ఫిర్యాదులు చేశారు. దీంతో తప్పులు జరిగాయా.. లేదా.. అనే అంశాన్ని తేల్చే అధికారం ఆర్జేడీకి ఉండటంతో జిల్లా విద్యాశాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల వేరే ఉపాధ్యాయులకు అన్యాయం జరిగినట్లు తెలుస్తుంది.

గతంలో బదిలీలకు వచ్చిన దరఖాస్తులు, హెచ్‌ఎంల బదిలీలు

జిల్లా	దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు	బదిలీ అయిన హెచ్‌ఎంలు
మహబూబ్‌నగర్	2,663	87
నాగర్‌కర్నూల్	2,478	35
వనపర్తి	1,639	31
జో గద్వాల	1,569	28
నారాయణపేట	1,469	21

నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..



గత ఆరేళ్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. వివిధ స్థాయిలో ఖాళీలు ఉన్నాయి. వీలైనంత త్వరగా బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలి. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బడుల్లో మంచి వాతావరణం ఏర్పడాలంటే అవకతవకలు లేకుండా ప్రమోషన్లు, పదోన్నతులు ఇవ్వాలి.
– నారాయణగౌడ్, పీఆర్టీయూ, జిల్లా అధ్యక్షుడు

సిద్ధంగా ఉన్నాం..



ప్రభుత్వ ఆదేశాలు వస్తే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. హెచ్‌ఎంల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై వివరాలు ఇవ్వాలని ఆర్జేడీకి ఫైల్ పెట్టాం. వాటి ఆధారంగా వాస్తవాలు తేల్చాల్సి ఉంటుంది.
– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

త్వరగా పూర్తిచేయాలి..



ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులపై నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయం. కోర్టు సమస్యలు ఉన్న వెంటనే క్లియర్ చేసి బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఇబ్బందులు లేకుండా నిర్వహించాలి. ఈ ప్రభుత్వం ప్రక్రియ పూర్తి చేస్తుందన్న నమ్మకం ఉంది. వీలైనంత త్వరగా 15 రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యే విధంగా షెడ్యూల్ ఇవ్వాలి.
– కృష్ణుడు, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

న్యూస్‌రీల్

కూలీల హాజరు నమోదు తప్పనిసరి



చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీలు పని ప్రదేశంలోనే ప్రతి కూలీ మస్టర్ రోల్‌లో నిత్యం హాజరు నమోదు తప్పనిసరిగా చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అంబుడ్స్ పర్సన్ జంగయ్య అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో గురువారం ఉపాధి పనులను ఆయన పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ఇతరుల పేరుతో కూలీలు పని చేయొద్దని సూచించారు. అనంతరం పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలపై ఆరా తీశారు.

రేపు 'ధిక్కార కవితా సంకలనం' ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్: హైదరాబాద్, రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ధిక్కార, మహాత్మా జ్యోతి బాపూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ సభ కొనసాగనుందని, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పి.వహీద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 'నెలపొడుపు' సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, బుర్రా వెంకటేశం ఐఏఎస్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. చరిత్రకారులు, సాహిత్య విమర్శకులు, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఈ సభకు సభాధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న, రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కవి, విమర్శకులు డాక్టర్ బి.ప్రసాదమూర్తి తదితరులు ప్రసంగించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి కవులు కళాకారులు రచయితలు బహుజన బంధుమిత్రులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

- జూన్ 12 నాటికి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు సిద్ధం
- కలెక్టర్ ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచామని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలియజేశారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ, వానాకాలం కార్యాచరణ ప్రణాళిక- ఎరువులు- విత్తనాల లభ్యత, మిషన్ భగీరథ ఇంటింటి సర్వేతో పాటు పలు అంశాలపై కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో తీసుకున్న చర్యలపై వివరించారు. వానాకాలం పంట కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో స్టాక్ నిల్వలో తేడా, ఇతర వివరాల నమోదులో లోటు పాట్లు కలిగిన దుకాణ డీలర్‌పై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కూడిన బృందాలు నిరంతరం తనిఖీ చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్ర స్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి వివరించారు. జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు అన్ని వసతులు సిద్ధం చేశామన్నారు. విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం జూన్ 12న నాడే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఉదయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు పాల్గొన్నారు.

గ్రూప్- 1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

నాగర్‌కర్నూల్: గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్ శర్మ కలిసి గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, రూట్ ఆఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు, బాధ్యతలను తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు 18 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,221 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని, ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లను మూసివేస్తామన్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు పాదరక్షలు మాత్రమే ధరించాలని, బూట్లతో పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు.

'మతోన్మాద విధానాలపై రాజీలేని పోరాటం'

కొల్లాపూర్ రూరల్: మతోన్మాద విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర నాయకుడు రవి కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సింగోటం గ్రామ సమీపంలో శ్రీవారి సముద్రం కట్టపై ఉన్న టూరిజం గెస్ట హౌజ్‌లో నిర్వహిస్తున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతంపేరుతో, కులంపేరుతో రాజకీయం చేసే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వర్ధం పర్వతాలు, అంజనేయులు, సురేందర్, తారాసింగ్, మండల కార్యదర్శి శివవర్మ, తదితరులు పాల్గొన్నారు.

జోరువాన.. పులకించిన రైతన్న

- పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- పెద్దకొత్తపల్లి మండలంలో అత్యధికంగా 69 మి.మీ వర్షపాతం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల గురువారం భారీ వర్షం కురిసింది. పెద్దకొత్తపల్లి మండలంలో అత్యధికంగా 69 మి.మీ వర్షపాతం నమోదైంది. కొల్లాపూర్, అమ్రాబాద్, అచ్చంపేట, లింగాల, నాగర్‌కర్నూల్ మండలాల్లో ఒక్కరోజే 45 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. తక్కువగా బిజినేపల్లి మండలంలో 4.4, పెంట్లవెల్లి మండలంలో 5.2 మి.మీ మేర వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షపాతం నమోదుకాగా, జిల్లాలోని వెల్దండ మండలం పెద్దపూర్‌లో పిడుగుపడి మహిళ జంగమ్మ మృతిచెందింది. మరో మూడు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షసూచన ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. పాతబడిన ఇళ్లు, శిథిలావస్థలోని ఇళ్లలో ఉండేవారు తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


తెలకపల్లి శివారులో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

ఏరువాకకు ముందే ఏరు
ఏరువాక పండుగకు ముందే ఏరు పారింది. ఇప్పటికే ఆరుతడి పంటలకు పొలాన్ని సిద్ధం చేసుకున్న రైతన్న సంబరంగా విత్తనం విత్తుకుంటున్నాడు. భారీ వర్షాలకు లింగాల మండలం దారారం చెక్‌డ్యాం అలుగు పారింది. దీంతో రైతులు నీటికి పూజలు చేశారు. వరుసగా మూడు నాలుగు రోజుల నుంచి వర్షాలు కురవడంతో రైతులు పొలాల్లో తలమునకలయ్యారు. జొన్న, ఆముదం, పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు: మి.మీ.లో

మండలం	వర్షపాతం
పెద్దకొత్తపల్లి	69
కొల్లాపూర్	59.4
అమ్రాబాద్	58
అచ్చంపేట	52.4
లింగాల	48.4
నాగర్‌కర్నూల్	45.4
వంగూర్	38.8
తాడూరు	29
తెలకపల్లి	28.4
వెల్దండ	28
ఉప్పునుంతల	26.4
బల్మూరు	26.4
కోడేరు	24.6
తిమ్మాజిపేట	14.6
చారకొండ	12.6
పదర	10.8
ఊర్కొండ	6.8
పెంట్లవెల్లి	5.2
బిజినేపల్లి	4.4


మంతటి నుంచి పెద్దముద్దునూర్‌కు వెళ్లే రోడ్డుపై నీటి ప్రవాహం

పిడుగుపాటుకు గురై మహిళా రైతు మృతి

వెల్దండ మండలం పెద్దాపూర్‌కు చెందిన కొమ్ము రెక్క జంగమ్మ(40) గురువారం పొలంలో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ఆమె పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కృష్ణయ్య, తల్లి ఈదమ్మ అపస్మారక స్థితికి చేరుకోగా.. స్థానికులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి యువకుడు మృతి


రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

తాడూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని శిర్సవాడ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఐతోలుకి చెందిన రాజశేఖర్ రెడ్డి(32) బైక్‌పై మాదారం వెళ్తుండగా.. శిర్సవాడ సమీపంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు రాజశేఖర్ రెడ్డికి తండ్రి తిరుపతిరెడ్డి, తల్లి రేణమ్మ ఉన్నారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడు దుర్మరణం

గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. ధరూర్ మండలానికి చెందిన బొప్పాల లక్ష్మణ(66) గురువారం ఉదయం బైక్‌పై గద్వాలకు వచ్చాడు. అయితే తిరుగుప్రయాణంలో గోనుపాడు శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమత్తం గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని రాజీవ్ గృహకల్పలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మూసాపేట మండలం సంకలమద్ది గ్రామానికి చెందిన సాయికుమార్ (25) కొన్ని రోజులుగా రాజీవ్ గృహకల్పలో అద్దెకు ఉంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ, జీవనం సాగిస్తున్న అతడికి రెండేళ్ల కిందట వివాహమైంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు.

సెల్ఫీ వీడియో తీసి.. ఆత్మహత్యాయత్నం

కొత్తకోట రూరల్: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కానాయపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిగేని భీమన్న, రాములమ్మ దంపతుల ఏకైక కుమారుడు కొడిగేని రాజు గురువారం సాయంత్రం కానాయపల్లి పునరావాస కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో పొలానికి పిచికారీ చేసే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడు. వెంటనే అది చూసిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరికొందరికి సమాచారం చేరవేసి ఘటన స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న రాజును స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా రాజు వీడియోలో పేర్కొన్న విషయం ఏమిటంటే ఎవరైనా సరే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటూ ప్రేమ వ్యవహారాన్ని ప్రస్తావించాడు. అయితే రాజు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేమ వ్యవహారం కారణమా? లేక ఆర్థిక ఇబ్బందులా? ఇన్నేళ్లైనా పెళ్లి కాలేదనే మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడా అనే అంశాలపై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రాజు పరిస్థితి నిలకడగా ఉందని, 24గంటలు గడిస్తే కానీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో గురువారం కురిసిన వర్షానికి తోడు పిడుగు పడటంతో తీగలపల్లికి చెందిన నెత్తికొప్పుల అరుణకు చెందిన చెందిన గేదె మృతి చెందింది. వర్షం రావటంతో పొలంలో గేదెను కట్టేసి ఇంటికి వెళ్లింది. ఆమె ఇంటికి చేరిన కొద్ది సేపటికే పిడుగు పడి పొలంలో గేదె మృతి చెందినట్లు తెలిపారు.

నిర్వహణ లోపం..


జాతీయ రహదారిపై దుమ్ము

- జాతీయ రహదారి పనులతో ప్రయాణికులకు ఆటంకం
- తీవ్ర దుమ్ముతో కానరాని రహదారి
- పనుల వద్ద నీళ్లు చల్లడంలో నిర్లక్ష్యం

గండేడ్: జాతీయ రహదారి అని సంతోషించాలో లేక దుమ్ముతో అవస్థలు పడాలో తెలియక వాహనదారులు తికమక అవుతున్నారు. దుమ్ములేచి కళ్లలో పడడంతో రహదారి సైతం కనిపించని పరిస్థితి. అసలే ఎండాకాలం కావడం, దానికి తోడు దుమ్ము తీవ్రత పెరిగి శ్వాస కోస ఇబ్బందులు కూడా వస్తున్నాయి. రోజుకు మూడు, నాలుగు సార్లు నీళ్ల చల్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్–చించోలి రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించింది. బెంగుళూరు ముంబాయిల మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరించడానికి పనులు చేపట్టారు. రాష్ట్రంలో మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈరోడ్డును 167 జాతీయ రహదారిగా గుర్తించారు. పనులను మొదటి ప్యాకేజి భూత్పూర్ నుంచి దుద్యాల వరకు, రెండోది దుద్యాల నుంచి మన్నెకలి వరకు విభజించారు.

నీళ్లు చల్లడంలో నిర్లక్ష్యం..

జాతీయ రహదారి పనులు ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ఎక్కడా జాప్యం కావడం లేదు. ఇరువైపుల రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులు జరుగుతున్న దుమ్ము లేవకుండా నీళ్ల పోయడంలో కాంట్రాక్టరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రోజుకు రెండు, మూడు సార్లు కూడా నీళ్ల పోయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుండడంతో రద్దీ కూడ ఎక్కువగా ఉంది. దీనికి తోడు కంకర కూడా ఉండడం మూలంగా చిన్న చిన్న రవ్వలు ఎగిరిపడుతున్నాయి. కోస్గి మండలం సంపల్లి, ఉమ్మడి గండేడ్ మండలంలోని జానంపల్లి నుంచి వెంకట్‌రెడ్డిపల్లి వరకు పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. జానంపల్లి, సల్కర్‌పేట్, గండేడ్, అంచన్‌పల్లి, కొంరెడ్డిపల్లి, సంచర్ల గేటు, మొకర్లాబాద్, మహమ్మదాబాద్, వెంకట్‌రెడ్డిపల్లితో పాటు హన్వాడ మండలం నాయినోనిపల్లి, హన్వాడా, పెద్దదర్పల్లి గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.


పూర్తికాని సర్వీసు రోడ్డు

అసంపూర్తి సర్వీసు రోడ్లతో సమస్యలు..

ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలగకుండా గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు వేస్తున్నారు. దాదాపు కిలోమీటరు మేర ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇప్పటికే సంపల్లి, జానంపల్లి, రంగారెడ్డిపల్లి గ్రామాల వద్ద సర్వీసు రోడ్ల పనులు పూర్తయ్యాయి. గండేడ్, కొంరెడ్డిపల్లి, మొకర్లాబాద్, మహమ్మదాబాద్, నాయినోనిపల్లి, హన్వాడా వద్ద పూర్తి కాలేదు. మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు పూర్తికాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వైపుల కొంత మేర పూర్తి చేశారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.

కళ్లు కనిపించడం లేదు..



రోడ్డు పనుల కారణంగా నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటేనే తల ప్రాణం తోకకు వస్తున్నది. కళ్లు కనిపించని విధంగా దుమ్ము లేస్తుంది. మహబూబ్‌నగర్ నుంచి గండేడ్ రావాలంటే నరకం చూడాల్సి వస్తుంది. ఎప్పుడో ఒక సారి నీళ్లు చల్లుతున్నారు. మధ్యాహ్నం పూట అయితే గోస భగవంతుడికే తెలుసు. కళ్లు పాడవుతున్నాయి. అధికారులు రోజు నీళ్ల చల్లేలా చర్యలు చేపట్టాలి.

– ర్యాకం కేశవులు, టీచర్, గండేడ్

గ్రామంలోకి రావాలంటేనే ఇబ్బంది



సర్వీసు రోడ్డు అసంపూర్తి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలోకి వెళ్లాలంటే కష్టమవుతున్నది. రోడ్డుకి ఇల్లు దగ్గరగా ఉండడంతో దుమ్ము పేరుకుపోతుంది. మహబూబ్‌నగర్, కోస్గి వెళ్లాలంటే భయంగా ఉంది. రోడ్డుపై దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, గండేడ్

కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చాం..

రోజు మూడు పూటల నీళ్లు చల్లుతున్నారు. ఎండాకాలం కావడం మూలంగా తొందరగా ఆరిపోతుంది. అయినా దుమ్ము లేవకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. వేసవి పూర్తయ్యే వరకు తడి ఆరకుండా పోయించేలా చూస్తాం. కొన్ని గ్రామాల వద్ద కొంతమేర పనులు మాత్రమే అసంపూర్తిగా ఉన్నాయి. సమస్యలు ఉన్న చోట సర్వీసు రోడ్డు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. మిగతా అన్ని చోట్ల దాదాపుగా పూర్తయ్యాయి.

– రమేష్, డీఈఈ, నేషనల్ హైవే

పోరాటాల పాలమూరు

- తెలంగాణ మలిదశ ఉద్యమం ఉధృతంగా సాగిన వైనం
- కేసీఆర్ ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచినప్పుడే..



పాలమూరు: ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాలమూరుకు ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచారు. ఆయన నాయకత్వంలోనే ప్రత్యేక రాష్ట్రం కల సాకారం కావడమే. నాడు జిల్లాలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా కొనసాగింది. ఉమ్మడి జిల్లాలోని కొత్తూరు నుంచి అలంపూర్ వరకు, దోమలపెంట నుంచి కొడంగల్ వరకు విద్యార్థులు, యవకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ సంఘాలు, కార్మిక వర్గాలు, రాజకీయ పార్టీలు పోరాటంలో కలిసొచ్చాయి. అప్పట్లో కేసులు, జైళ్లకు వెళ్లిన వారు నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు లేకపోలేదు. ఒకానొక దశలో ఉద్యమం లేదన్న గడ్డపై కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించిన తర్వాత ఉద్యమం మరింత ఉధృతమైంది. దీక్షతో అన్నివర్గాలు ఏకమై తెలంగాణ డిమాండ్‌తో కదనరంగంలోకి దూకారు. ఫ్రీ జోన్‌తో మొదలైన ఉద్యమం రాష్ట్రాన్ని సాధించే వరకు తిరుగులేకుండా సాగింది. ఉద్యమ నాయకత్వం ఏ పిలుపునిచ్చినా ఐక్యంగా ముందుకు సాగారు.

జిల్లాలో 36 మంది అమరులు..

ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర సాధన ఉద్యమం ఉధృతంగా సాగింది. అప్పంపల్లిలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరు సాగించగా.. నిజాం సైనికుల కాల్పుల్లో ఎందరో బలయ్యారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణాలు కోల్పోయిన చరిత్ర ఉమ్మడి జిల్లాకు ఉంది. అమ్రాబాద్ మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన నాగరాజు ప్రాణాలర్పించగా.. కొత్తకోటకు చెందిన కావలి సువర్ణ రాష్ట్రంలోనే తొలి మహిళ ప్రాణ త్యాగం చేసిన మహిళగా నిలిచింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 36 మంది అమరులయ్యారు. ఇందులో కావలి సువర్ణ, నరేష్, వీరసాగర్, సత్యమ్మ, శంకర్, బాలస్వామి, నాగరాజు, వాసు, వెంకటేశ్, శ్రీనివాస్, చంద్రయ్య, ప్రేమ్‌కుమార్, కరుణాకర్, యాదయ్య, శేఖర్, మల్లేష్, వెంకటయ్యగౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, కుమార్‌గౌడ్, కృష్ణయ్య, చెన్నయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం ప్రభుత్వం అందించింది.

38 అడుగుల భారీ స్తూపం..

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి గుర్తింపుగా అమరవీరుల స్తూపాన్ని నిర్మించాలని భావించిన ప్రజాప్రతినిధులు పాలమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో 38 అడుగుల భారీ స్తూపాన్ని ఏర్పాటు చేశారు. 800 గజాల స్థలంలో స్తూపంతో పాటు పార్క్ ఏర్పాటు చేశారు.

ఫోన్‌కు ఆన్‌లైన్ లింక్ మెసేజ్

- ఓపెన్ చేస్తే రూ.12 లక్షలు మాయం



గద్వాల క్రైం: గుర్తు తెలియని సైబర్ నేరస్తులు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వ్యక్తిగత ఖాతాలోంచి రూ.12 లక్షల నగదును కాజేసిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నవీన్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు వ్యక్తిగత మొబైల్‌కు ఆన్‌లైన్ నుంచి లింక్‌ను పంపించారు. లింక్‌ను ఓపెన్ చేయగా.. తన వ్యక్తిగత ఖాతాలోంచి రూ.12 లక్షల నగదును కాజేసినట్లు గుర్తించాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

కేవీకేలతో రైతులకు విస్తృత సేవలు


రైతులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఏడీఆర్ డా.మల్లారెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయ పరిశోధనల తర్వాత వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా కృషి విజ్ఞాన కేంద్రాలు ఎంతో పని చేస్తున్నాయని, వాటి ద్వారా రైతులకు విస్తృత సేవలు అందుతున్నాయని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డా.మల్లారెడ్డి అన్నారు. మోహన్ సింగ్ మెహతా కమిటీ సిఫార్సుల మేరకు మొదట కేవీకేను తమిళనాడులోని పాండిచ్చేరిలో 1974వ సంవత్సరంలో స్థాపించారని, ఈ యాభై సంవత్సరాల కాలంలో వాటి సంఖ్య 731 వరకు చేరిందన్నారు. గురువారం పాలెం కేవీకేలో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డా.మల్లారెడ్డి మాట్లాడారు. వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా అభివృద్ధి చేసిన విత్తనాలు, యంత్ర పరికరాలను క్షేత్రస్థాయిలో రైతులకు పరిచయం చేయడంలో కేవీకేలది కీలకపాత్ర అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయంలో వచ్చిన మార్పులను రైతులకు చేరడంలో కేవీకేల పాత్ర అభినందనీయమన్నారు. పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా విత్తనాల్లో నూతన వంగడాలను, యంత్ర పరికరాలను పరిచయం చేసి వారిని ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయిస్తున్నామన్నారు. వ్యవసాయం వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతుల్లోని మెళకువల్ని శిక్షణ కేంద్రాల ద్వారా రైతులకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ఆయా గ్రామాలకు చెందిన ఆదర్శ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలామృతం ప్లస్‌తో చిన్నారులకు మేలు


చాగదోన అంగన్‌వాడీలో వివరాలను పరిశీలిస్తున్న స్టేట్ టీం సభ్యులు

గట్టు: బాలామృతం ప్లస్‌తో చిన్నారుల్లో శారీరక ఎదుగుదలతోపాటు పోషణ లోపాలు అధిగమించినట్లు స్టేట్ టీం సభ్యులు హరిప్రీత్, భాస్కర్ తెలిపారు. ఎత్తుకు తగ్గ బరువు, పోషణ లోపాల నుంచి బయటపడిన చిన్నారుల గురించి స్టేట్ టీం సభ్యులు గురువారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. బింగిదొడ్డితండా, చాగదోన–1 అంగన్‌వాడీ కేంద్రాలను స్టేట్ టీం సభ్యులు పరిశీలించారు. ఎస్‌ఎస్‌ఎఫ్‌పీ కార్యక్రమంలో భాగంగా 2019లో చిన్నారుల్లో పోషణ లోపాలు, ఎత్తుకు తగిన బరువు కల్గి ఉండకపోవడం వంటి వారిని సాధారణ స్థితి తీసుకువచ్చేందుకు గద్వాల, ఆసీఫాబాద్ జిల్లాలను ఎంపిక చేసి, బాలామృతం ప్లస్‌ను అందిస్తు వచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఈ జిల్లాల్లో పోషణ లోపాలతో బాధపడుతున్న చిన్నారులను, ఎత్తుకు తగిన బరువు లేకుండా ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి క్రమం తప్పక అంగన్‌వాడీ టీచర్ పర్యవేక్షణలో బాలామృతం ప్లస్‌ను అందిస్తూ, వారిని సాధారణ స్థితికి తీసుకు వచ్చే విధంగా కృషి చేశారు. ప్రస్తుతం స్టేట్ టీంతో పాటుగా సెంట్రల్ టీంలు కూడా పలు దఫాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఫలితాలను గుర్తించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా గద్వాల జిల్లాలో చాలా మంది 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు బాలామృతం వాడడం ద్వారా పోషణ లోపాలను అధిగమించి, సాధారణ స్థితికి వచ్చినట్లు అంగన్‌వాడీ సూపర్ వేజర్ వాసంతి తెలిపారు. వీటి ఫలితాలను గుర్తించి, అధ్యయనం చేసేందుకు స్టేట్ టీం సభ్యులు క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నట్లు సూపర్ వేజర్ తెలిపారు. ఇందులో భాగంగానే స్టేట్ టీం సభ్యులు బింగిదొడ్డి తండా, చాగదోన గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాల్లో శ్యామ్, మామ్ పిల్లల వివరాలను పరిశీలించి, అంగన్‌వాడి టీచర్ ద్వారా వివరాలను నమోదు చేసుకున్నారు.

రెండు రోజుల్లో 110 శస్త్ర చికిత్సలు

- అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో సర్జికల్ క్యాంపు
- ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహణ


రోగిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సర్జికల్ క్యాంపు గురువారం కొనసాగింది. రెండు రోజుల్లో 110 మందికి వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు రోగులను పరీక్షిస్తూనే.. అవసరమున్న వారికి శస్త్ర చికిత్సలు చేస్తూ, బిజీగా గడిపారు. రోగులను వారి బంధువులను ఆప్యాయంగా పలకరిస్తూ, మందుల చీటీ రాశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. నల్లమల ప్రాంత ప్రజలకు వైద్యపరంగా, రాజకీయంగా సేవ చేయడం గర్వంగా ఉందన్నారు. సర్జికల్ క్యాంపులో 1,230 మంది వివిధ శస్త్రచికిత్స కోసం పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. సహకరించిన వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఓ రమేష్‌చంద్ర, సూపరింటెండెంట్ ప్రభు, డా.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో జాగ్రత్తలు పాటించాలి

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందు కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నకిలీల బెడద ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. వానాకాలం సాగు చేసే అన్నదాతలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందు కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే పంట సాగు కష్టం, బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుంది. విత్తన, ఎరువుల కొనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఏ తెలియజేశారు.

విత్తన కొనుగోళ్లలో...

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులో విత్తనం రకం, నంబర్, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలరు సంతకం, రైతు సంతకం బిల్లులో ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి కొనుగోలు చేయవద్దు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్లవద్దు.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయ దారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువ తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.


వానాకాలం పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలను తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలను పరిశీలించాలి.
- మొలకెత్తే దశలో, పూత దశలో లోపాలు కనిపిస్తే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు దాచి ఉంచుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని పరిశీలించాలి. మొలక శాతం సంతృప్తిగా ఉంటేనే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందు కొనుగోళ్ల సమయంలో..

చీడపీడల నివారణకు వినియోగించే క్రిమిసంహారక మందుల కొనుగోలు సమయాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- వ్యవసాయ, ఉద్యాన, శాస్త్రవేత్తలు సూచించిన మందులను మాత్రమే కొనుగోలు చేయాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసినా.. నిల్వ ఉంచిన పురుగు మందులను వాడొద్దు.
- లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోళ్లు చేయాలి.
- పురుగు మందుల డబ్బాపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విష పూరితమైతే నీలం రంగు, స్వల్ప విష పూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలు, ధ్వంసం చేసి గుంతలో పూడ్చి పెట్టాలి. పురుగు మందులు వాడటానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు...

- లైసెన్స్ దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులు పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువు సంచులనే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఖచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రసీదులో రైతు విధిగా సంతకం చేయాలి.
- ఎరువుల నాణ్యతపై అనుమానాలు ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపాలి.
- చిల్లుపడిన, చిరిగిన బస్తాల్లోని ఎరువుల బస్తాలను కొనుగోలు చేయరాదు.

PRAGATHI COLLEGE OF EDUCATION (B.ED.)
(RECOGNIZED BY N.C.T.E & AFFILIATED TO PALAMURU UNIVERSITY)
ACHAMPET, NAGARKURNOOL (DIST), T.S-509375
WANTED PRINCIPAL & LECTURERS
Applications are invited for the following posts from the desirable candidates to teach B.Ed course. Principal- 01, Lecturer in Physical science -01, Lecturer in English - 01, Lecturer in Perspectives of Education - 01, Lecturer in Physical Education -01, Lecturer in performing Arts (Music)-01
Eligibility: Principal Ph.D in Education, PG with 55%, M.Ed with 55%,&NET/SET& 08 years teaching experience. Lecturers-PG with 55%, M.Ed. with 55% &NET/SET
Note: Eligible candidates may send their resumes with in 10 days to the college.
e-mail id:pragathicollegeofeducationbed@gmail.com
Cell: 8555935985, 9490143075

సాక్షి క్లాసిఫైడ్స్


WANTED
ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు ఫిమేల్ ఇన్‌ఛార్జ్‌స్ కావలెను. జీతము: 12000/- మరియు భోజనం, వసతి కల్పించబడును. పనిచేయు ప్రదేశం: హైదరాబాద్. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 91000 69434

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
HAPPY BIRTHDAY
కేవలం రూ.500/-

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రిగా ఈనెల 12న చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తొలుత 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినా అదేరోజు ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తుండడం .. ఆ కార్యక్రమానికి హాజరవ్వాల్సి వుండడంతో చంద్రబాబు తన కార్యక్రమాన్ని 12కు వాయిదా వేసుకున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లుచేస్తున్నారు. దానికి ముందు 11వ తేదీన టీడీపీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు టీడీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును టీడీపీ పక్ష నేతగా ఎన్నుకుంటారు. చంద్రబాబును టీడీఎల్పీ నేతగా ఎన్నుకుని గవర్నర్‌కు నివేదించాక 12న ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి విడతగా కొందరిని మంత్రులుగా ప్రమాణం చేయించనున్నట్లు తెలిసింది. సుమారు పది మందికి తొలి విడతలో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ నుంచి ఐదారుగురు, జనసేన, బీజేపీ నుంచి నలుగురు ఆ జాబితాలో ఉండే అవకాశం ఉంది. తొలి విడతలో కింజరాపు అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి. నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు వంటి వారికి అవకాశం ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన నుంచి పవన్‌కళ్యాణ్ మంత్రివర్గంలో చేరతారా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీ తరఫున సుజనాచౌదరికి తొలి విడతలోనే మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం ఖాయమని చెబుతున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా ఆనం రామనారాయణరెడ్డిని నియమించే యోచనలో టీడీపీ ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

టీడీపీకి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి?

ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ప్రధాన పార్టీగా ఉండడంతో టీడీపీ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీ అగ్రనేతలు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ చంద్రబాబు ఆ పదవి కావాలని గట్టిగా పట్టుబడితే ఏమైనా నిర్ణయం మారే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఐదుకి పైగా స్థానాలు కోరుతుండడం, కీలకమైన జల్‌శక్తి, రవాణా వంటి శాఖలు అడుగుతుండడంతో దానిపైనా రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ పౌర విమానయాన, ఉక్కు శాఖలను టీడీపీకి ఇవ్వాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

యథేచ్ఛగా హింస

కఠిన చర్యలు తీసుకోండి.. గవర్నర్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ

సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు

పోలీసులు ఏం చేస్తున్నారని గవర్నర్ విస్మయం



గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అధికారం చేపట్టక ముందే టీడీపీ, జనసేన నాయకులు యథేచ్ఛగా సాగిస్తున్న హింసాకాండపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విన్నవించారు. ఈమేరకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేశినేని నాని, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు గురువారం వినతిపత్రం అందచేసిన అనంతరం మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు అనంతరం బిహార్ తరహాలో రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకాండ, హింసాత్మక ఘటనలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. టీడీపీ మూకలు ఎన్నికల రోజు మధ్యాహ్నం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు తెగబడి పలు చోట్ల గృహ దహనాలు, ఆస్తులను ధ్వంసం చేశాయన్నారు. మహిళలు, పిల్లలను సైతం హింసించి భయ భ్రాంతులకు గురిచేశాయని తెలిపారు. టీడీపీ, జనసేన విధ్వంస కాండకు సంబంధించి వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి విస్తుపోయిన గవర్నర్.. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, కళ్ల ముందే దాడి జరిగినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. నూజివీడులో కౌన్సిలర్‌పై పోలీసుల సమక్షంలోనే కత్తులతో దాడి జరగటాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చామన్నారు. ఈ ఘటనలపై డీజీపీతో చర్చించి చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారన్నారు.

పర్యవసానాలు తప్పవు

వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకున్న వారిపై దాడులు చేసేందుకే అధికారంలోకి వచ్చారా? అని టీడీపీ నేతలను పేర్ని నాని ప్రశ్నించారు. ఎర్ర పుస్తకం పేరుతో హింసకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కూటమి నాయకులకు సూచించారు. చంద్రబాబు ఒత్తిడితో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. దాడులను ఆపకుంటే పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలను కాపాడుకునేందుకు కమిటీలు, లీగల్ టీమ్స్

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు 26 జిల్లాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రత్యేక కమిటీలను వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసినట్లు పేర్ని నాని వెల్లడించారు. బాధితులను పరామర్శించడంతో పాటు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ హింసాకాండను మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. 26 జిల్లాలో ఏర్పాటైన లీగల్ టీమ్‌లు బాధితులకు అండగా నిలుస్తాయని, శుక్రవారం నుంచి చురుగ్గా పని చేస్తాయని తెలిపారు. కింది స్థాయి పోలీసులు కేసులు నమోదు చేయకుంటే ఎస్పీలను కలిసి న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు.

మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో వ్యవస్థీకృత హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా దాడులు
- గ్రామాలు వీడకుంటే చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆస్తుల ధ్వంసం.. మహిళలు, పిల్లలను హింసిస్తున్నారు
- పోలీసుల నిర్లిప్తతతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి
- సాక్ష్యాధారాలతో ఈ-మెయిల్ ద్వారా సీజేఐకి బాధితుల ఫిర్యాదు
- సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారించాలంటూ అభ్యర్థన

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు దాడులతో వ్యవస్థీకృత హింసకు పాల్పడుతుండటంపై బాధితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గ్రామాలు, ఆస్తులను వదిలేసి కట్టుబట్టలతో వెళ్లకుంటే హతమారుస్తామంటూ హెచ్చరిస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తూ పిల్లలు, మహిళలను సైతం హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని విన్నవించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవస్థీకృత హింసను సుమోటోగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా స్వీకరించి ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించాలని అభ్యర్థించారు. వ్యవస్థీకృత హింసకు సంబంధించి మీడియా కథనాలు, సోషల్ మీడియా వీడియోల సాక్ష్యాధారాలతో బాధితులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి గురువారం ఈ-మెయిల్ ద్వారా పిర్యాదు చేశారు.

బాధితుల ఆక్రందన ఇదీ..

- ప్రస్తుతం రాష్ట్రంలోని పాలనా యంత్రాంగంలో నెలకొన్న అస్థిర పరిస్థితులను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు, పిల్లలు, మహిళలపై వ్యవస్థీకృత హింసకు పాల్పడుతున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి.
- పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో అసాంఘిక శక్తులు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడుతున్నాయి. గత 24 గంటల్లో హింసాత్మక సంఘటనలు భారీగా పెరిగాయి.
- సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించకుంటే ఈ వ్యవస్థీకృత హింస నుంచి బాధితులకు రక్షణ లభించదు. ఈ అంశాన్ని సుమోటో పిల్‌గా స్వీకరించి విచారించాలి. రాష్ట్ర ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాలి.

అరాచకాన్ని అరికట్టండి

ఏపీలో విధ్వంసకాండపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా కొనసాగుతున్న దాడులు, హింసాకాండను తక్షణం అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను పార్టీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ అల్లరిమూకలు సంధి కాలాన్ని ఎంపిక చేసుకుని విధ్వంసాలకు తెగబడటం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టం చేసింది. అరాచక శక్తులు చెలరేగుతున్నా పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేలా తక్షణం కఠిన చర్యలకు ఆదేశించాలని కోరింది. ఈమేరకు రాష్ట్రపతి, గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్ రెడ్డి గురువారం విడివిడిగా లేఖలు రాశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మరో లేఖ ద్వారా కోరారు.

ఊరూరా విధ్వంసం.. అదే టీడీపీ లక్ష్యం

- పలుచోట్ల శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలపై దాడి
- ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు కూల్చివేత
- సచివాలయాలపై అక్కసుతో పేట్రేగిన వైనం
- విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రచ్చ
- సంకురాత్రిపాడులో బోర్డులు, శిలాఫలకాలు, దిమ్మెలు ధ్వంసం
- సచివాలయంపై టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



తలకు గాయాలైన తలతోటి దావీదు



తలకు తీవ్ర గాయాలైన మద్దూరి పౌలు

యడ్లపాడు : వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సీ కాలనీలోని చర్చి కింద జాలాది మార్గంలోని చెరువులో సుమారు 3.5 ఎకరాల ఆక్రమిత సాగుభూమి ఉంది. దీనిపై వచ్చే ఆదాయాన్ని ఏటా సంఘ పెద్దలు చర్చి అభివృద్ధి పనులకు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతేడాది కౌలుకు తీసుకున్న కనపర్తి రత్తయ్య తన కౌలు డబ్బులు ఇస్తానంటూ చర్చికి రావాలని సంఘ పెద్దల్ని కోరాడు. దీంతో సంఘ పెద్దలు ఆరుగురు బెజ్జం అనిల్, వలేరు లాజర్, వడ్డానం మాణిక్యరావు, గద్ద సీమోను, తిరుపతి రామారావు, మద్దూరి మనోహర్, తలతోటి దావీదు చర్చికి చేరుకుని కౌలు డబ్బులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. పెద్దలంతా చర్చి నుంచి బయటకు వస్తున్న క్రమంలో ఆ ప్రాంతానికి వచ్చిన గ్రామ టీడీపీ నాయకుడు మైలవరపు వెంకట కోటయ్య.. సంఘ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడైన తలతోటి దావీదుతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అదేకాలనీలోని తమ పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి.. దాడికి దిగారు. దావీదుతో వచ్చిన మరో పెద్ద మద్దూరి మనోహర్ పరారు కాగా, దావీదును నాపరాయితో తలపై మోదారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మద్దూరి మనోహర్ అనే వలంటీర్ దావీదును చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ఇదిలా ఉండగా పొలం నుంచి కాలనీ వైపు టీవీఎస్‌పై వస్తున్న మద్దూరి పౌలు.. టీడీపీ కార్యకర్తలు కర్రలతో రావడం గమనించి బండి వెనక్కు తిప్పే ప్రయత్నం చేశాడు. అతన్ని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో పట్టుకుని దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

షాక్‌సర్క్యూట్‌తో లైన్‌మన్‌కు గాయాలు

మద్దూరు: లైన్‌మన్‌కు షాక్ తగిలి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఖాజీపూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. దామరగిద్ద మండలంలో విద్యుత్ శాఖలో ఒత్తుగుండ్లకు చెందిన దాసరి రఘు జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈదురు గాలుల వల్ల మద్దూరు మండలంలోని భీంపూర్ 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి దామరగిద్ద మండలంలోని మెగులమడ్కలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లైన్లు సరిచేయడానికి దామరగిద్ద ఏఈ అనిల్ కుమార్, లైన్‌మెన్లు హన్మంతు, బసిరెడ్డితో పాటు రఘు, విద్యుత్ కార్మికులు వెళ్లారు. ఖాజీపూర్ వద్ద విద్యుత్ లైన్ సరిచేసే క్రమంలో విద్యుత్ సరఫరా జరిగి స్తంభంపై ఉన్న రఘుకు షాక్ తగిలి కింద పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడే ఉన్న సిబ్బంది 108లో నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. విద్యుత్ ఏఈ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపించారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు


అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే) సమీప అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి గ్రామ సమీపంలోకి వచ్చింది. వీధికుక్కలు వెంబడిస్తుండగా గ్రామస్తులు చూసి దుప్పిని రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గాయపడిన దుప్పిని డీఆర్‌ఓ లక్ష్మీకాంత్, సిబ్బందితో ప్రత్యేక వాహనంలో అమ్రాబాద్ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. పశువైద్యాధికారి అనిల్ చికిత్స నిర్వహించి మాదవానిపల్లి అటవి ప్రాంతంలో వదిలేసినట్లు ఎఫ్ఆర్‌ఓ ఆదిత్య తెలిపారు.



వాహనంలో దుప్పికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

మరమ్మతులు ప్రారంభం

జూరాల ఎడమ కాల్వ జీరో పాయింట్ నుంచి కిలోమీటర్ వరకు..



జూరాల ప్రాజెక్టు ప్రధాన హెడ్ రెగ్యులేటరీ ముందు భాగం

- కొనసాగుతున్న పూడికతీత
- లైనింగ్ పనులు కూడా..

అమరచింత: జూరాల జలాశయం ఎడమ కాల్వ ప్రధాన హెడ్ రెగ్యులేటరీ నుంచి కిలోమీటరు వరకు పూడికతీతతో పాటు కాల్వ అడుగు భాగంలో కొత్తగా బెడ్ వేసే పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. వారం రోజులుగా కాల్వలో పూడికతీత పనులు కొనసాగుతుండగా.. సాగునీరు సాఫీగా పారేందుకు అడుగు భాగాన కొత్తగా బెడ్ వేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎడమ కాల్వ మొత్తంలో ప్రధానంగా ఎనిమిది ప్రాంతాల్లో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. కాల్వ ముందుభాగంలో లైనింగ్ పూర్తిగా దెబ్బతిని అడుగుభాగం పెచ్చులూడుతుండటంతో ముందుగా వీటి మరమ్మతుకు ప్రభుత్వం రూ.7 లక్షలు మంజూరు చేసింది. టెండర్‌లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరమ్మతులు చేపడుతున్నారని ఏఈ ఆంజనేయులు వివరించారు.



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారులు

1996లో లైనింగ్ పనులు..

జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ లైనింగ్ పనులు 1996లో జరిగాయి. తర్వాత నిర్వహణ లేకపోవడంతో నీటి ప్రవాహ వేగానికి కాల్వ అడుగు భాగంతో పాటు కాల్వ అంచులు నెర్రెలుబారాయి. సుమారు 24 ఏళ్ల తర్వాత కాల్వ ముందుభాగంలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టడం.. త్వరలోనే మిగిలిన సమస్యలను గుర్తించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

లైనింగ్ పనులు పూర్తిచేయాలి..



జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ లైనింగ్ పూర్తిగా దెబ్బతినక ముందే గుర్తించిన ప్రదేశాల్లో మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి. లైనింగ్ బాగుంటే చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారే అవకాశం ఉంది.


– సుధాకర్, ఆయకట్టు రైతు, మూలమళ్ల

రోజు పర్యవేక్షిస్తున్నాం..

కాల్వ మరమ్మతు పనులను నిత్యం పరిశీలిస్తున్నాం. వర్షాలు ప్రారంభం కావడంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై వత్తిడి పెంచుతున్నాం. ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

– ఆంజనేయులు, ఏఈ

దెబ్బతిన్న అడుగుభాగం..



జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటరీ వద్ద అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. అలాగే కాల్వలో పూడిక పేరుకుపోయింది. వీటి మరమ్మతులు, తొలగింపునకు రూ.ఏడు లక్షలు మంజూరయ్యాయి. పనులు త్వరగా పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రధాన ఎడమకాల్వ విభాగం

అమరచింత నుంచి వీపనగండ్ల వరకు..

జిల్లాలోని అమరచింత మండలం నుంచి వీపనగండ్ల మండలం వరకు 75 కిలోమీటర్ల పొడవున జూరాల ప్రధాన ఎడమ కాల్వ విస్తరించి ఉంది. కాల్వ మరమ్మతులను గుర్తించిన అధికారులు బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని పలుమార్లు నివేదించారు. గత ప్రభుత్వ హయంలో మరమ్మతులు వేగవంతంగా పూర్తవుతాయని ఆశించిన ఆయకట్టు రైతులకు నిరాశే మిగిలింది. నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదు.

మైసమ్మ అడవి.. ప్లాస్టిక్ రహితం



పర్వతాపూర్ మైసమ్మ అడవి

- వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ చర్యలు

నవాబుపేట: చిరుతలకు ఆవాసంగా ఉన్న పర్వతాపూర్ మైసమ్మ అటవీ ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు తరహాలోనే మైసమ్మ అడవిలో ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని రెండు ప్రధాన అడవులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉండగా.. ప్లాస్టిక్‌తో వన్యప్రాణులకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలను పోలి ఉన్న పర్వతాపూర్ మైసమ్మ అడవిపై అటవీ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. అడవిలో ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. అడవిలో వెలసిన మైసమ్మను దర్శించుకోవడానికి ప్రతి ఆది, మంగళవారాలలో భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. ఇతర రోజుల్లో సైతం భక్తుల రద్దీ ఉంటుంది. ఈక్రమంలో పర్యావరణ నిపుణుల సూచన మేరకు మైసమ్మ అడవిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ చర్యలు చేపట్టింది. కాగా, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత అభివృద్ధి సాధిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం పాటించాలని కోరుతున్నారు.

‘ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. సీపీఎస్ రద్దుతో పాటు జీవో 317తో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. 13 జిల్లాలలో స్పౌజ్ కలిగిన వారికి తగిన ఉత్తర్వులు ఇవ్వాలని, బదిలీలు, పదోన్నతులకు వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు పరచాలన్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులను బదిలీ చేసి 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. సీఎంను కలిసిన వారిలో టీపీఆర్‌టీయూ నాయకులు ఉన్నారు.



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

జూలై 3 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జులై 3 నుంచి 6వ తేదీ వరకు అండర్–19 బాల బాలికల రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీని తొలిసారిగా నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యాంసుందర్‌గౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలోని ఆరు కోర్టుల్లో సింథటిక్ మ్యాట్లపై పోటీలు జరుగుతాయని వివరించారు. 3వ తేదీన క్వాలిఫైయింగ్ రౌండ్, 4 నుంచి 6 వరకు డబుల్స్, సింగిల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీల్లో 120 నుంచి 150 మంది క్రీడాకారులు, 12 నుంచి 15 మంది అఫీషియల్స్ పాల్గొంటారని.. వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు రాష్ట్రస్థాయి టోర్నీ కేటాయించినందుకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడ వ్యవహారాలశాఖ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధానకార్యదర్శి పుల్లెల గోపీచంద్ హాజరవుతారని వివరించారు. సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ, ఎండీబీఏ ప్రధానకార్యదర్శి ఎల్.రవికుమార్, సాదత్‌ఖాన్, అహ్మద్‌అలీ, శివప్రసాద్, ఎంపీ ప్రవీణ్‌కుమార్, సతీష్ జోసెఫ్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎండీబీఏ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్

